## క్లుప్తంగా

### టార్పాలిన్ల పంపిణీ



భిక్కనూరు: మండల కేంద్రంలో నిరుపేదల ఇళ్ల రక్షణ కోసం కౌసల్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళితవాడలో టార్పాలిన్లను పంపిణీ చేశారు. కౌసల్య ఫౌండేషన్ చైర్మన్ జ్ఞానప్రకాశ్ రెడ్డి శుక్రవారం దళితవాడలో ఇంటింటికి వెళ్లి టార్పాలిన్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.లక్ష వెచ్చించి వంద ఇళ్లకు టార్పాలిన్‌లను అందజేశానన్నారు. నేతలు దప్పు రవి, తాటికొండ బాబు తదితరులు ఉన్నారు.

### 24 గంటలూ అందుబాటులో ఉండాలి



భిక్కనూరు: వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండాలని భిక్కనూరు వైద్యులు యెమిమా అన్నారు. ఆమె మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందికి పలు సూచనలను అందజేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులన్నీ సబ్‌సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ సతీష్ ఉన్నారు.

### బోసిపోయిన బస్టాండ్..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ బోసిపోయింది. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి, బాన్సువాడ, హైద్రాబాద్‌కు సంబంధించి రాకపోకలు లేకపోవడంతో బస్సులు రాక, ప్రయాణికులు లేక బస్టాండ్ ఖాళీగా దర్శనమిస్తోంది. బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డి మీదుగా హైద్రాబాద్‌కు వెళ్లే దారి లేకపోవడంతో పాటు, ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్లే దారులు కోతకు గురికావడంతో మూడు రోజులుగా రాకపోకలు నిలిచి పోయాయి.

### వైద్య శిబిరాల ఏర్పాటు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శుక్రవారం వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స చేశారు. జ్వరం, చర్మం వ్యాధి, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘం(బీకేఎస్) మండల అధ్యక్షుడు బస్వరాజ్ దేశాయ్ కోరారు. శుక్రవారం పలు గ్రామాల్లో అకాల వర్షాలకు పంటలు నీట మునిగిపోవడంతో సంఘ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట మునిగిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారని తెలిపారు. అధికారులు పరిశీలించి రైతులకు ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు.

### ఆపద సమయంలో అండ



నిజాంసాగర్(జుక్కల్): ఆపత్కాలంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బాధితులకు కొండంత అండగా నిలుస్తున్నారు. శుక్రవారం నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని గోర్గల్, తుంకిపల్లి పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. ముంపు బాధితులతో పాటు పేదల సమస్యలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. అలాగే జుక్కల్, మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద మండలాల్లోని పునరావాస కేంద్రాలను సందర్శించారు. పునరావసా కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఆహారంతో పాటు వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.



పాల్కంపేట చౌదరీ చెరువుకు గండి పడడంతో పంట పొలాల్లో పేరుకుపోయిన బురద



మల్లారం చెరువుకు గండి పడడంతో నీట మునిగిన వరి పంటలు



వరద తాకిడికి కొట్టుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్



బిచ్కుంద శివారులో నీట మునిగిన వరి పంట



వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాజుల్లా-బిచ్కుంద మధ్య నిలిచిపోయిన రాకపోకలు



పిట్లం శివారులో నీట మునిగిన పత్తి

# కన్నీరు మిగిల్చిన వాన

- భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంట మునక
- తీవ్రంగా ధ్వంసమైన రహదారులు
- పలుచోట్ల దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు
- వరదలో కొట్టుకుపోయిన మూగజీవాలు
- నష్టపోయిన రైతన్నలు



కోతకు గురైన ఎల్లారెడ్డి- కామారెడ్డి ప్రధాన రహదారి



జీఆర్ కాలనీలో బయటపెట్టిన తడిసిన సామగ్రి



సంతాయిపేట్‌లో వరి పంట కొట్టుకుపోయిన తర్వాత..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షాలు రైతులకు కన్నీరు మిగిల్చాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు నీట మునిగాయి. వేల ఎకరాల్లో ఇసుక, బురద మేట వేసింది. దీంతో అన్నదాతలకు తీరని నష్టం ఏర్పడింది. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టినా వేల ఎకరాలు నీటిలోనే మగ్గుతున్నాయి. పంట చేలల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. వరద నీటి ప్రవాహానికి రహదారులు కోతకు గురయ్యాయి. చాలా చోట్ల రోడ్ల ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. దీంతో చాలా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. మూగజీవాలు వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడటంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. చెరువులు, కుంటలు నిండి గండ్లు పడ్డాయి. దీంతో సమీప పొలాలను ముంచెత్తాయి



బీబీపేటలో వరి పొలంలో ఇసుక మేటలు వేయడంతో పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



బీబీపేటలో పెద్ద చెరువుకు పడ్డ బుంగను పూడ్చుతున్న స్థానికులు



బోలక్‌పల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న మంజీర నది



తిమ్మాపూర్‌లో వరదకు కొట్టుకు పోయిన వరి పంట



నెమ్లిలో నీట మునిగిన పంటను చూపుతున్న రైతు



అన్నాసాగర్ శివారులో పంట పొలంలో రాళ్లు



దోమకొండ శివారులో వర్షానికి పంట పొలాల్లోకి కొట్టుకువచ్చిన ట్రాక్టర్



ప్రమాదకరంగా కొండాపూర్ బ్రిడ్జి వద్ద రహదారి



మాచారెడ్డి పరిధిలో..

## పంట నష్టపోయిన రైతుల వివరాలను అందించాలి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు
- వరద నీటిలో చిక్కుకున్న కుటుంబానికి పరామర్శ



వరదనీటిలో చిక్కుకున్న బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: మండలంలో పంట నష్టం జరిగిన రైతుల వివరాల నివేదికను అందించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలో కల్యాణి ప్రాజెక్టు మట్టి కట్ట తెగిపోవడంతో దానిని పరిశీలించారు. అనంతరం తిమ్మారెడ్డిలో వరద నీటిలో చిక్కుకున్న బాలరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరదల వల్ల పంట నష్ట పోయిన బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఈవిషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని అన్నారు. మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంతోష్ తదితరులున్నారు.

## గోపాల్‌పేట-ఎల్లారెడ్డి మధ్య రాకపోకల పునరుద్ధరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాల కారణంగా గోపాల్‌పేట-ఎల్లారెడ్డి మధ్య జాతీయ రహదారి దెబ్బతినడంతో మూడురోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరదనీరు జాతీయ రహదారిపై నుంచి తొలగిపోవడంతో శుక్రవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లతో మొరం వేయించి రాకపోకలను పునరుద్ధరింపజేశారు.

## వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు విఘ్నం



కామారెడ్డి హౌసింగ్ బోర్డు కాలనీలో గణపతి విగ్రహాలను వదిలేసి వెళ్తున్న విక్రయదారులు



బీబీపేటలో వర్షాల కారణంగా చిన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న మండలి నిర్వాహకుడు



వరదల కారణంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో ప్రతిష్ఠాపనకు నోచుకోని విగ్రహం

కామారెడ్డి టౌన్: భారీ వర్షాల కారణంగా వినాయక చవితి రోజు చాలా చోట్ల భారీ విగ్రహాల ప్రతిష్ఠాపన నిలిచిపోయింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రతి యేటా 400 నుంచి 500 పైగా భారీ విగ్రహాలు, జిల్లా వ్యాప్తంగా మరో 12 వేల నుంచి 15 వేలకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. బీబీపేట మండల కేంద్రానికి సంబంధించి 50 పైగా విగ్రహాలను ప్రతిష్ఠాపన చేయకుండా పెద్దమ్మ ఆలయంలో ఉంచారు. జిల్లా కేంద్రంలో 150 విగ్రహాల ప్రతిష్ఠాపన ఆగిపోయింది. పండగ రోజు మండళ్ల నిర్వాహకులు చిన్న విగ్రహాలను లాంఛనంగా ప్రతిష్ఠాపన చేశారు. శుక్రవారం వర్షం తగ్గిపోవడంతో మండపాలకు భారీ విగ్రహాలను తరలిస్తున్నారు. మరికొన్ని విగ్రహాలు కొనుగోలు చేసేవారు లేక విక్రయదారుల వద్దే ఉండిపోయాయి. కొన్ని వర్షానికి ధ్వంసమయ్యాయి. రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు చెందిన విగ్రహాల తయారీదారులు విగ్రహాలకు ఇక్కడే వదిలేసి వెళ్లిపోయారు.

## 'బొగ్గు గుడిసె'ను ముంచిన వరద



నిజాంసాగర్(జుక్కల్): పొట్టకూటి కూసం కోటి తిప్పలు పడుతున్న పేదలను వరుణదేవుడు నిండా ముంచాడు. వారు ఏర్పాటు చేసుకున్న రేకులషెడ్లు, షట్టర్లు, ఇళ్లు వరద ధాటికి నామరూపాల్లేకుండా పోయాయి. మహమ్మద్‌నగర్ మండలంలోని బొగ్గు గుడిసె చౌరస్తా మూడు రహదారులకు ప్రధాన కూడలిగా ఉంది. హసన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద ఒకరిద్దరు నివాసాలతో పాటు టీ పాయింట్లు, టిఫిన్ సెంటర్లు, బైక్ మెకానిక్, పంక్చర్, మొబైల్, హెయిర్ కటింగ్ వంటి దుకాణాలను నడుపుకుంటున్నారు. కల్యాణి ప్రాజెక్టు వరద కారణంగా బొగ్గు గుడిసె చౌరస్తాను ముంచేసింది. రోజంతా బొగ్గు గుడిసె చౌరస్తా నీటిలో తేలాడింది. బాధితులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

## 3,450 ఎకరాల్లో పంట నష్టం



భిక్కనూరులో కొట్టుకుపోయిన వరి పంటను చూపుతున్న రైతు



పాముల వాగు పరీవాహక ప్రాంతం లింగంపల్లి శివారులో ఏర్పడిన ఇసుక మేటలు

భిక్కనూరు: మండలంలో ఇటీవల రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు 3,450 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసినట్టు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి గర్దాసు నరేంద్ర, ఏఈవో వినోద్‌గౌడ్‌లు శుక్రవారం తెలిపారు. అన్ని గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 3 వేల ఎకరాల్లో వరి, 450 ఎకరాల్లో పత్తి, కూరగాయలు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు వారు వివరించారు.

**లింగంపేట పరిధిలో..**

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పరిధిలో 3,305 ఎకరాల్లో వరి, 280 ఎకరాల్లో మొక్కజొన్న, 210 ఎకరాల్లో పత్తి, 15 ఎకరాల్లో సోయాబీన్, 45 ఎకరాల్లో చెరుకు, నష్టం జరిగినట్లు ఏవో అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, ఎల్లారెడ్డి సహాయ సంచాలకులు సుధామాధూరి పంటలను పరిశీలించారు.

## కొట్టుకుపోయిన సిమెంటు పరికరాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు) గ్రామం పాముల వాగు పక్కన రెండేళ్లుగా సిమెంటు పలకలు, రింగులు, ఇటుకలు, సిమెంటు పోల్స్, కులాయిలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షానికి పాముల వాగు ఉప్పొంగి ప్రవహించింది. దాంతో పక్కనే సిమెంటుతో తయారు చేసిన పరికరాలు, సాంచలు నది ప్రవాహానికి కొట్టుకుపోయాయి. సుమారు 200లకుపైగా సిమెంటు పలకలు, పోల్స్ ధ్వంసమయ్యాయి. దీంతో రూ. 4లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## బాన్సువాడ పట్టణ కాలనీల్లోకి చేరిన నీరు

బాన్సువాడ: బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లో మూడు రోజులు భారీ వర్షం కురిసింది. బీర్కూర్‌లో పంట పొలాలు నీట మునిగాయి. బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీ, సాయికృపానగర్, ఎన్‌జీవోఎస్ కాలనీల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. కాలనీలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలోకి భారీగా నీరు వచ్చింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలకు బాన్సువాడలో 992 ఎకరాలు, బీర్కూర్‌లో 473 ఎకరాలు, నస్రుల్లాబాద్‌లో 438 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. చెరువును తలపించేలా వరి పంట నీటిలోనే ఉంది. బీర్కూర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల్లో నీట మునిగిన పంటలను ఏడీఏ లక్ష్మీప్రసన్న, ఏఈవోలు పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. బీర్కూర్ మంజీర బ్రిడ్జికి వెళ్లే దారిలో గైపీర్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో బీర్కూర్-కుర్ల, బిచ్కుందకు రాకపోకలు బంద్ చేశారు.

## మోడల్ వసతి గృహం ఖాళీ



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట మోడల్ పాఠశాల వసతి గృహంలో ఉన్న విద్యార్థినులను శుక్రవారం అధికారులు ఖాళీ చేయించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తుండటంతో చిన్నపూల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. అంతేకాకుండా వరద నీటి ప్రవాహానికి చిన్నపూల్ వంతెన రెయిలింగ్ కొట్టుకుపోవడంతో పాటు పగుళ్లు వచ్చాయి. ఈ విషయాన్ని పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్, కాంగ్రెస్ నేత మల్లికార్జున్‌లు.. ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదకరంగా ఉన్న వంతెనను చూసి వసతి గృహాన్ని ఖాళీ చేయించారు. మోడల్ ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య వసతి గృహ విద్యార్థినులను ప్రత్యేక బస్సులో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి తరలించారు.



పాముల వాగు ఉప్పొంగి కొట్టుకుపోయిన లింగంపల్లి(ఖుర్దు)వద్ద కామారెడ్డి-ఎల్లారెడ్డి రోడ్డు



గాంధారి వాగు వరద ధాటికి ఇసుక, రాళ్లలో కూరుకుపోయిన గంగమ్మ విగ్రహం

## శిథిలావస్థకు చేరిన ఇళ్ల కూల్చివేత



బాన్సువాడ: పట్టణంలో శిథిలావస్థకు చేరిన పెంకుటిళ్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెంకుటిళ్లు కూలిపోయే ప్రమాదం ఉండడంతో ఆయా ఇండ్లలో నివాసముంటున్న వారిని సురక్షిత ప్రాంతాల్లో ఉంచి ఆ ఇళ్లను కూల్చి వేశారు. పట్టణంలో 8 పురాతన ఇండ్లలో నాలుగు ఇళ్లలో ఎవరూ నివాసం లేకపోవడంతో ఆ ఇండ్లను ప్రొక్లెయిన్ సహాయంతో కూల్చి వేశారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ నివాసం ఉండవద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు సూచించారు.

## ఆర్మీ సహకారంతో గమ్యానికి చేరుకున్న ప్రయాణికులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మూడురోజులుగా కురిసిన భారీవర్షాలతో పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లడంతో కామారెడ్డి-మెదక జిల్లాలను కలిపే ఎన్‌హెచ్-765డి ప్రధాన రహదారి ధ్వంసమై ఇరు జిల్లాల మధ్య గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కాగా శుక్రవారం ఆర్మీ సిబ్బంది మెదక్ జిల్లా పోచమ్మరాల్ వైపు నుంచి వాగులో తాళ్లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సమకూర్చుకున్న బోటు ద్వారా ఇరు జిల్లాల ప్రయాణికులను సాహసోపేతంగా తెగిపోయిన రోడ్డును దాటించారు. బోటు సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.